# సాక్షి గుంటూరు


బుధవారం, 22, మే, 2024






## నేడు నృసింహస్వామి కల్యాణం

తాడేపల్లిరూరల్: పోలకంపాడులోని వరాహ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది.



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.

## ఘనంగా హరిద్ర శృంగార్చన



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులోని బగళాముఖి అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. బండ్లమ్మ వారిని మహా గౌరీ దేవిగా అలంకరించారు.

## న్యూస్‌రీల్

### 24న డీఈఈ సెట్ ఆన్‌లైన్ పరీక్ష

నెహ్రూనగర్: డీఈఈ సెట్ 2024 కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ టెస్ట్ ఈనెల 24వ తేదీ నిర్వహించనున్నట్లు గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పరిధిలో రెండు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, శ్రీ మేధా టవర్స్, చల్లావారిపాలెం, నల్లపాడు, గుంటూరు సెంటర్ కోడ్ 8384, బాలాజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బి బ్లాక్, చల్లావారిపాలెం, నల్లపాడు, గుంటూరు, సెంటర్ కోడ్ 30318 సెంటర్స్‌లో ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు 384 మంది హాజరు కానున్నారని చెప్పారు. కేటాయించిన సెంటర్‌కు అభ్యర్థులు ఒక గంట ముందుగానే హాజరు కావాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద డిపార్ట్‌మెంట్ అధికారులను కేటాయించామని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాల్ టికెట్‌లో ఏమైనా పొరపాట్లు ఉంటే డిపార్ట్‌మెంట్ అధికారుల ద్వారా సరిచేసుకోవచ్చన్నారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, గుంటూరులో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల విభాగం ద్వారా తమ సమస్యలను ముందుగానే పరిష్కరించుకోవాలన్నారు.

### రేపు భావన్నారాయణుని రథోత్సవం



బాపట్ల: శ్రీ మత్స్యాందరవల్లి రాజ్యలక్ష్మి సమేత క్షీరభావన్నారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు, రథోత్సవం గురువారం నిర్వహించనున్నట్లు కె.సుబ్బారావు తెలిపారు. మంగళవారం స్థానిక దేవాలయంలో వివరాలు వెల్లడించారు. గురువారం ఉదయం శ్రీవారి కల్యాణ మహోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సంతర్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో బాబు నాగేంద్ర, వి.శ్రీనివాసరావు, వెంకటరమణబాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# వైద్యకళాశాల సువర్ణాధ్యాయం

- అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక కృషి
- ప్రత్యేకంగా రూ.500 కోట్లు మంజూరు
- గతంలో ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 52 పీజీ సీట్లు కేటాయింపు
- నూతనంగా వైద్య విభాగాల ఏర్పాటుకు చర్యలు
- వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టుల భర్తీ



కళాశాల 75 ఏళ్ల పైలాన్ ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

గుంటూరు మెడికల్: ఆణిముత్యాల్లాంటి ఎందరో వైద్యులను ప్రపంచానికి అందించిన ఘనత దక్కించుకున్న గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక కృషి చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న వైద్యులు, వైద్య సిబ్బంది పోస్టులను భర్తీ చేశారు. అదనంగానూ పోస్టులు మంజూరు చేశారు. కళాశాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు విడుదల చేశారు. 52 పీజీ సీట్లు వైద్య కళాశాలకు తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోంది. ఆయన పాలనలో వైద్యకళాశాల సువర్ణాధ్యాయాన్ని లిఖించింది.

**చరిత్ర ఘనమే**

గుంటూరు వైద్య కళాశాల 1946లో ప్రారంభమైంది. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడకు వెళ్లినా గుంటూరు వైద్య కళాశాలలో చదువుకున్న వైద్యులు కనిపిస్తారు. భారతదేశంలో ఏర్పాటైన తొలి రెండు వైద్య కళాశాలల్లో గుంటూరు ఒకటి. అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఆచంట రుక్మిణమ్మ కృషి ఫలితంగా ఆంధ్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చొరవతో గుంటూరు వైద్య కళాశాల ఏర్పాటైంది. ఎంతో మంది రాజకీయ నాయకులను అందించిన ఘన చరిత్ర కలిగిన గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి గతంలో ఎవరూ చూపని చొరవను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపించారనడంలో ఎలాంటి సందేహం లేదు.

**ఇవిగో సీఎం చేసిన విప్లవాత్మక మార్పులు**

- గుంటూరు వైద్య కళాశాల చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ఒకే ఏడాదిలో 34 పీజీ సీట్లు మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతోంది. ఈ ఐదేళ్లలో మొత్తం 52 పీజీ సీట్లు కళాశాలకు మంజూరు చేయడం విశేషం.



గుంటూరు వైద్య కళాశాల

- గుంటూరు వైద్య కళాశాల ఏర్పడి 75 ఏళ్లు గడిచినా ఎంతో కీలకమైన ప్రిన్సిపాల్ పోస్టుకు అడిషనల్ డీఎంఈ హోదా లేదు. దీనివల్ల నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తనిఖీల సమయంలో అడిషనల్ డీఎంఈ హోదా లేని ప్రిన్సిపాల్ వల్ల ఇబ్బందులు పడేవారు. దీనిని గుర్తించిన సీఎం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ పోస్టుకు అడిషనల్ డీఎంఈ హోదా కల్పించారు.
- గతంలో ప్రొఫెసర్లు, అసోసియేట్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రమోషన్లు లేక అవస్థలు పడేవారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక కళాశాల బోధనా సిబ్బంది, అందరికీ ప్రమోషన్లు ఇచ్చారు.
- ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేశారు. వైద్య విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన, రోగులకు సత్వర మెరుగైన చికిత్సలు అందించేందుకు అదనంగా పోస్టులనూ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.
- ప్రొఫెసర్లు 15, అసోసియేట్ ప్రొఫెసర్లు 15, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 31 పోస్టులు నూతనంగా మంజూరు చేసి అరుదైన రికార్డును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించారు.
- వైద్య కళాశాలలో సుమారు 25 ఏళ్లుగా ఖాళీగా ఉన్న 32 పారా మెడికల్ పోస్టులు భర్తీ చేసి అదనంగానూ పోస్టులు మంజూరు చేశారు. మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, ఎమర్జన్సీ మెడిసిన్ వైద్య విభాగాలను నూతనంగా మంజూరు చేశారు. పలు వైద్య విభాగాల్లో అదనంగా యూనిట్లు మంజూరు చేశారు.

**నిధులు మంజూరు**

గతంలో ఎన్నడూ లేని విధంగా వైద్య కళాశాల అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా రూ.500 కోట్లు మంజూరు చేశారు. వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ ఛాతి, సాంక్రమిత వ్యాధుల ఆస్పత్రి అభివృద్ధికి రూ.50 కోట్లు మంజూరు చేశారు. వైద్య కళాశాలలో పీజీ సీట్లకు వసతులు కల్పించేందుకు రూ.50 కోట్లు మంజూరు చేశారు. మైక్రో బయాలజీ, పెథాలజీ, బ్లడ్‌బ్యాంక్, డెర్మటాలజీ వైద్య విభాగాల్లో కోట్లాది రూపాయలతో వైద్య పరికరాలు అందజేశారు.

# కౌంటింగ్ విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

**కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి**





అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి చివరి దశలోకి వచ్చామని, కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా ముగించే వరకూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల శిక్షణ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కౌంటింగ్ ప్రక్రియ జరుగుతుందని, స్ట్రాంగ్ రూమ్‌ల నుంచి ఈవీఎంలు తీసుకు వచ్చిన దగ్గర్నుంచి కౌంటింగ్ పూర్తవగానే మళ్లీ వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్, తర్వాత సర్వీస్ ఓటర్లు, ఆ తర్వాత ఈవీఎంల ఓటింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సూచనలు ఆర్ఓలు, ఏఆర్వోలు తప్పక పాటించాలన్నారు. నిబంధనలు అందరూ తెలుసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు జరిగిన ఎన్నికల ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేయడం సంతోషమన్నారు.

**ఐడీ కార్డులు తప్పనిసరి**

కౌంటింగ్ విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది, పోలీసు బృందాలకు ఐడీ కార్డులు తప్పనిసరిగా ఉండాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. నియోజకవర్గాల వారీగా సిబ్బంది చేరుకునేందుకు సైన్‌బోర్డులు ఉండాలన్నారు. కౌంటింగ్ హాలు వద్ద రిసెప్షన్, హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సెల్‌ఫోన్లకు అనుమతి లేదని పేర్కొన్నారు. లోపలికి వెళ్ళే ముందే మొబైల్స్ సంబంధిత కౌంటర్ల వద్ద డిపాజిట్ చేయాలన్నారు.

రిజర్వ్ టీములకు ప్రత్యేక హాలు ఏర్పాటు చేయాలన్నారు. లెక్కింపునకు 14 టేబుళ్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జనరేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 25, 26 తేదీల్లో కౌంటింగ్ సిబ్బందికి తొలి దశ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వచ్చే నెల 3న ఏఎన్‌యూలో రెండో దశ శిక్షణ, అనంతరం సిబ్బందికి కౌంటింగ్ కేంద్రాలు కేటాయిస్తామని తెలిపారు. ఎన్నికల పరిశీలకులు సంతకం చేసిన తర్వాత మాత్రమే సిబ్బంది ఫలితాలను వెల్లడించాలన్నారు. సమావేశంలో జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖార్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# నృసింహుని జయంత్యుత్సవాలు

మంగళగిరి: పట్టణంలోని లక్ష్మీనృసింహ స్వామి జయంత్యుత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ నరసింహమూల మంత్ర హోమం, సాయంత్రం ఆరు గంటలకు విశ్వక్సేన పూజ, అగ్నిప్రణయనం, కుమ్భారాధన నారసింహ హోమం పూజలు చేశారు. అనంతరం స్వామికి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.



గ్రామోత్సవంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు

# దూరవిద్య సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని సార్వత్రిక, దూరవిద్యా కేంద్రం ద్వారా వ్యవసాయ విద్య విస్తృత వ్యాప్తికి సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ కె.గురవారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల రైతులు, మహిళలు, యువతకు 8 వారాలపాటు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించే పలు కోర్సులను ఇప్పటికే ఏప్రిల్ నుంచి ప్రారంభించామని పేర్కొన్నారు. మిద్దె తోటల పెంపకం, పట్టుపురుగుల పెంపకం, జీవన ఎరువుల తయారీ వంటి మూడు కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. ఆసక్తిగల వారు రూ.1500 ఫీజు చెల్లించి జూన్ 20లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్‌ను సందర్శించాలని, లేదా 8008788776, 8309626619, 8096085560 సెల్ నంబర్ల ద్వారా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకూ సంప్రదించవచ్చని వివరించారు.



# నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

- సచివాలయ ఉద్యోగి హత్య కేసును ఆత్మహత్యగా చిత్రీకరించొద్దు
- పొన్నూరు అంబేడ్కర్ సెంటర్‌లో కుటుంబ సభ్యుల నిరసన
- దారుణం జరిగి 14 రోజులైనా చర్యల్లేవని ఆందోళన



రోడ్డుపై బైఠాయించిన కిషోర్‌బాబు కుటుంబ సభ్యులు

పొన్నూరు: సచివాలయ ఉద్యోగి హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. హత్యను, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు పోలీసులు యత్నిస్తున్నారని ఆరోపించారు. వివరాల ప్రకారం కొల్లిపర మండలం సిరిపురం గ్రామానికి చెందిన తుల్లిమిల్లి కిషోర్‌బాబు పట్టణ పరిధిలోని సచివాలయంలో ఎమినిటీస్ సెక్రటరీగా పనిచేస్తున్నాడు. తన భార్య చంద్రకళ సచివాలయ మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తోంది. వీరిద్దరికీ 11 నెలల క్రితం వివాహం జరిగింది. తన భార్య బదిలీపై మాచర్ల నుంచి పొన్నూరు రావడంతో కిషోర్‌బాబు కూడా పొన్నూరుకు బదిలీ చేయించుకున్నాడు. హఠాత్తుగా ఈనెల 7న కిషోర్‌బాబు నిడుబ్రోలు చెరువులో శవంగా తేలాడు. పోలీసులు ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. మృతుడి ఒంటిపై గాయాలను గుర్తించిన కుటుంబ సభ్యులు కిషోర్‌బాబు మృతిపై అనుమానాలు ఉన్నాయని, అతని భార్య, కుటుంబ సభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**పోలీసుల అజాగ్రత్త వల్లే హత్య**

కేసు నమోదై 14 రోజులు గడుస్తున్నా కిషోర్‌బాబు హత్యకు కారకులైన వారిపై చర్యలు తీసుకోలేదని, నిందితులను తప్పించేందుకు పోలీసులు యత్నిస్తున్నారని ఆరోపిస్తూ అతడి కుటుంబ సభ్యులు సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. భార్య, బావమరుదులు, వారి పెదనాన్న తనను హత్య చేసేందుకు యత్నిస్తున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ ఈ నెల 6న కిషోర్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడని, అప్పుడే వారు చర్యలు తీసుకుని ఉంటే కిషోర్‌బాబు బతికి ఉండేవాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ రాత్రే కిషోర్‌బాబు శవమై చెరువులో తేలాడని కన్నీరుమున్నీరయ్యారు. కిషోర్‌బాబు మృతిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు నిరాహార దీక్ష చేపట్టేందుకు సిద్ధమవడంతో రూరల్ ఎస్ఐ భార్గవ్ ఘటన స్థలానికి చేరుకొని బాధితులకు సర్దిచెప్పి న్యాయం జరిగేలా చేస్తానని హామీ ఇచ్చారు.



ఎస్ఐతో మాట్లాడుతున్న తల్లి ప్రేమలత

**న్యాయం చేయండి**

నా కొడుకును దారుణంగా కొట్టి చంపిన వారిని వారిని వెంటనే అరెస్టు చేయాలి. కేసును నీరుగార్చేందుకు పోలీసులు యత్నిస్తున్నారు. హత్యకు గురైన నాకొడుకు మరణాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు నా చేత సంతకం చేయించుకున్నారు. వెంటనే బాధ్యులపై కేసు నమోదు చేసి కఠిన శిక్ష పడేలా చేయాలి. న్యాయం చేయాలని కోరుతున్నా.

– ప్రేమలత, కిషోర్‌బాబు తల్లి

## మూడు మండలాల్లో వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు మూడు మండలాల్లో వర్షం పడింది. మంగళగిరి మండలంలో 16.6 మిల్లీమీటర్లు, తుళ్ళూరు మండలంలో 5.8 మి.మీ., కొల్లిపర మండలంలో 5.2 మి.మీ. చొప్పున వర్షం పడింది. మే 21 వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 42.2 మి.మీ నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 83.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

## కాశీలో నృత్యనీరాజనానికి తెనాలి చిన్నారులు



తెనాలి: పట్టణానికి చెందిన నృత్యశిక్షణ సంస్థ శ్రీకళ్యాణి కూచిపూడి ఆర్ట్స్ అకాడమీకి అరుదైన అవకాశం లభించింది. పవిత్ర పుణ్యక్షేత్రమైన కాశీలో శ్రీకాశీ విశ్వనాథ్‌స్వామి ఆలయంలో నర్తించే అవకాశం లభించింది. భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్, శ్రీకాశీ విశ్వేశ్వర ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న అక్కడ జరిగే నృత్యనీరాజనంలో నృత్యాంశాలను ప్రదర్శించనున్నట్టు అకాడమీ వ్యవస్థాపకురాలు, ప్రముఖ నృత్యగురువు డాక్టర్ చల్లా బాలత్రిపుర సుందరి తెలిపారు. తెనాలి నుంచి తమ బృందానికి మాత్రమే ఈ అవకాశం లభించిందని చెప్పారు. తనతోపాటు వలివేటి మోక్షిత, చలమలశెట్టి మహతి, వల్లూరు వరలక్ష్మి, పావని, భావజ్ఞసాయి సహా మొత్తం 21 మంది అక్కడ బృంద నాట్యాలను ప్రదర్శించనున్నట్టు వివరించారు. బృందంలోని కొంత మందితో బయలుదేరి వెళ్లారు.

# జగనన్న గృహాల పరిశీలన

**లేఅవుట్లను సందర్శించిన ఢిల్లీ సెక్రటేరియట్ బృందం**



ప్రత్తిపాడు జగనన్న లేఅవుట్‌లో రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు అందించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పరిశీలిస్తున్న ఢిల్లీ అధికారుల బృందం

ప్రత్తిపాడు: ఇళ్లు ఎలా ఉన్నాయి? నిర్మాణానికి ఎంత ఖర్చయింది? ప్రభుత్వం ఎంత ఇచ్చింది? మీకు అదనంగా ఎంత ఖర్చయింది? కాలనీలో వసతులు ఎలా ఉన్నాయి? అంటూ ఢిల్లీ సెక్రటేరియట్ అధికారుల బృందం హౌసింగ్ లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రత్తిపాడులోని జగనన్న హౌసింగ్ లే అవుట్‌ను మంగళవారం మధ్యాహ్నం ఢిల్లీ సెక్రటేరియట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లుగా చేస్తున్న ఆరుగురు అధికారుల బృందం సందర్శించింది. సెక్రటేరియట్ ఏఎస్‌ఓలు జలేష్‌యాదవ్, అమర్‌దీప్ చౌహాన్, ధృవ్ దమిజా, కపిల్, పూజా, శృతి కాలనీలోని ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. విద్యుత్ సౌకర్యం, డ్రెయినేజీ సౌకర్యం, మంచి నీటి కుళాయిలు ఉన్నాయా లేవా అన్న విషయాలను గృహాల్లోకి వెళ్లి పరిశీలించారు. కాలనీలో ఇబ్బందులు లేవని లబ్ధిదారులు బృందానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు ఉచితంగా ఇంటి స్థలాన్ని అందించిందని, రిజిస్ట్రేషన్ చేసి మరీ తమకు డాక్యుమెంట్లు అందజేసిందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను బృంద సభ్యులకు చూపించి ఆనందం వ్యక్తం చేశారు.

- అనంతరం నడింపాలెం గ్రామంలో బృందం పర్యటించింది. సంపద కేంద్రం (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్)లో గ్రామ పంచాయతీ చేస్తున్న వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించారు. నాణ్యత బాగుండటంతో అధికారుల బృందం 12 ప్యాకెట్లను కొనుగోలు చేసింది.
- తుమ్మలపాలెంలో పర్యటించిన బృందం ఆ గ్రామంలో అమలవుతున్న జలజీవన్ మిషన్ పథకాన్ని పరిశీలించింది. బృందం వెంట నోడల్ ఆఫీసర్ నాగానంద్, అసిస్టెంట్ నోడల్ ఆఫీసర్ జీవీఆర్ గుప్తా, డీపీఆర్‌సి డీటీఎం నాగేశ్వరరావు, ప్రత్తిపాడు మండల ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా తుమ్మలపాలెం శివాజీ తదితరులు ఉన్నారు.

# పచ్చిరొట్ట సాగు.. భూమి బాగు

- 18 మండలాలకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల సరఫరా
- జిల్లా వ్యాప్తంగా 324 క్వింటాళ్ల జీలుగలు
- 473.42 క్వింటాళ్ల జనుములు
- 1,105.30 క్వింటాళ్ల పిల్లిపెసర విత్తనాలు మంజూరు

కొరిటెపాడు(గుంటూరు): రైతులు ఒకప్పుడు సేంద్రీయ ఎరువుల ఆధారంగా పంటలను సాగు చేసేవారు. దీంతో ఏళ్ల తరబడి పంటలను సాగు చేసినా భూమి స్వభావం మారేది కాదు. మారిన పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు మొగ్గు చూపుతూ వచ్చిన రైతులు అధిక దిగుబడుల సాధన కోసం రసాయన ఎరువులు, పురుగు మందులను విచక్షణా రహితంగా వాడటం మొదలు పెట్టారు. దీంతో తాత్కాలికంగా అధిక దిగుబడులు సాధించి తృప్తి పడుతూ వచ్చినా భూమి ఆరోగ్యం గురించి నిర్లక్ష్య ధోరణి కనిపిస్తూ వచ్చింది. గత కొన్నేళ్లుగా పంటల సాగు ఇదే రీతిలో సాగడం వల్ల భూమి స్వభావంలో మార్పులు సంభవిస్తున్నాయి. భూమి నిస్సారంగా మారుతోంది. ఒకప్పుడు వర్షాధారం ద్వారా గానీ లేక కాలువలు, చెరువులు, నదులు, బావుల ద్వారా దాదాపుగా స్వచ్ఛమైన నీటిని పంటలకు ఉపయోగించేవారు. రానురాను భూగర్భ జలాలు అడుగంటుతూ వస్తున్న తరుణంలో వేలాది అడుగుల లోతు వరకు బోర్లను వేసి ఆ నీటితో పంటలను సాగు చేయాల్సి వస్తోంది. ఇలా పలు కారణాల వలన భూమి స్వభావంలో తీవ్ర మార్పులు సంభవించడం, సాగు చేసిన పంటలను చీడపీడలు అధికంగా ఆశించడం, దిగుబడులు గణనీయంగా తగ్గపోవడం జరుగుతోంది.

**పచ్చిరొట్టతో భూమికి ఆరోగ్యం**

ఈ క్రమంలో రైతులు భూమి ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకోవడంపై మొగ్గు చూపుతున్నారు. నిస్సారంగా మారిన పొలాలను సారవంతం చేసుకోవడానికి గల అవకాశాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందులో భాగంగా అనుభవజ్ఞులైన వ్యవసాయదారులు, వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పచ్చిరొట్ట ఎరువులను సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా వరి సాగులో భూమిలో కలియదున్ని కుళ్లింప చేయడానికి అవకాశాలు ఉండటంతో వరి రైతులు ఎక్కువగా వీటి సాగుకు ముందుకు వస్తున్నారు. పచ్చిరొట్ట సాగు వల్ల భూమి సారవంతం కావడమే కాక సేంద్రీయ పదార్థాలను నేలకు తద్వారా పంటలకు అందించే అవకాశం ఉంది. కలుపు మొక్కల వ్యాప్తిని తగ్గించడం, మొక్కలకు కావాల్సిన అన్ని పోషక పదార్థాలను సక్రమంగా అందించే వ్యవస్థను మెరుగుపరచడం సాధ్యమవుతుంది.

**సాగు ఇలా...**

భూసారం పెంచడంలో సహాయకారిగా ఉండే పచ్చిరొట్ట పైర్లయిన జనుము, జీలుగలు, పిల్లిపెసర, అలసంద వంటి పంటలను సాగు చేయడానికి రైతులు ఇష్ట పడుతున్నారు. సేద్యం చేసిన పొలంలో జీలుగలు, పిల్లి పెసర విత్తనాలైతే ఒక ఎకరాకు 10 నుంచి 12 కిలోలు, జనుము విత్తనాలు 16 కిలోల వరకు చల్లి నీటిని పెట్టాల్సి ఉంటుంది. తరువాత అవసరాన్ని బట్టి నీటిని కట్టాలి. ఇవి వర్షాభావ పరిస్థితులనూ తట్టుకుని పెరుగుతాయి. జీలుగ, జనుము, పిల్లిపెసర సాగు వలన హెక్టారుకు దాదాపు 18 నుంచి 21 టన్నుల గ్రాసం దిగుబడి వస్తుంది. దీన్ని పశువుల మేతగా కూడా వాడుతున్నారు. ఎరువు కోసమైతే పచ్చి రొట్ట పైర్లను పూత సమయంలో నేలలో కలియ దున్నాలి. పైరు వయసు 50 నుంచి 60 రోజులలోపు కలియ దున్ని ఒకటి రెండు వారాల తరువాత నాట్లు వేసుకోవడం ద్వారా మంచి ఫలితం పొందడానికి అవకాశం ఉంటుంది.



పచ్చి రొట్ట విత్తనాల బ్యాగులు

**నత్రజని వాడకం తగ్గించుకోవచ్చు..**

ప్రస్తుతం పొలాలకు రసాయనిక ఎరువుల రూపంలో అందిస్తున్న నత్రజని(యూరియా) వాడకాన్ని దాదాపు 20 నుంచి 30 శాతం వరకు తగ్గించుకోవడం ద్వారా ఆదా చేసుకోవచ్చు. దీంతోపాటు నేలలో నీరు, రసాయన ఎరువులు భూమి కింది పొరలకు జారి పోకుండా అడ్డుకట్ట పడుతుంది. నేలలో చౌడును తగ్గించడానికి సహాయకారిగా మారుతుంది.

**జిల్లాకు 1,902.72 క్వింటాళ్లు..**

గుంటూరు జిల్లాలోని 18 మండలాలకు 1,902.72 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు కేటాయించారు. వీటిలో జీలుగలు 324 క్వింటాళ్లు, జనుములు 473.42 క్వింటాళ్లు, పిల్లి పెసర విత్తనాలు 1105.30 క్వింటాళ్లు కేటాయించడం జరిగింది. విత్తనాలను 50 శాతం సబ్సిడీపై అందించనున్నారు. సబ్సిడీ విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే విత్తనాలు సరఫరా చేస్తారు.

**సబ్సిడీపై విత్తనాల పంపిణీ**



నిస్సారంగా మారుతున్న నేల ఆరోగ్య రక్షణకు సహాయపడే పచ్చిరొట్ట ఎరువుల సాగును పెంచడంలో భాగంగా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా 50 శాతం సబ్సిడీపై పచ్చి రొట్ట విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా రైతులకు పంపిణీ చేస్తోంది. ఇందుకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో రైతుల పేర్ల నమోదు కార్యక్రమం జరుగుతోంది. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

–నున్నా వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు